

మరమ్మతుకు నోచుకోని కాజ్‌వే

- భాంజీపేటలో ధ్వంసమై ఆరు నెలలు
- పట్టించుకోని అధికారులు



వరదలకు ధ్వంసమై ప్రమాదకరంగా ఉన్న భాంజీపేట కాజ్‌వే

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేట వాగు వద్ద ఆరు నెలల క్రితం భారీ వర్షాలకు కాజ్‌వే ధ్వంసమైంది. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వారు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.30 లక్షలతో నిర్మించిన ఈ కాజ్‌వే ఏడాది లోపే వరద తాకిడికి దెబ్బతినడంతో అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి ఎంత వరద వస్తుంది..? ఎంత సామర్థ్యంతో కాజ్‌వే నిర్మించాలన్న కనీస విషయాలను సంబంధిత అధికారులు పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరించిన తీరు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ప్రభుత్వం బ్రిడ్జికి బదులుగా రూ.30 లక్షల కాజ్‌వే మంజూరు చేయగా, కాంట్రాక్టర్ కాజ్‌వే నిర్మించి కేవలం 5 లైన్లతో పైపులు మాత్రమే వేసి ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్ నిర్మించారు. ఆరు నెలల క్రితం కురిసిన భారీ వర్షానికి ఇబ్రహీంపూర్ పెద్ద చెరువు గుండా వచ్చిన వరద ప్రవాహం పైపుల గుండా వెళ్లే పరిస్థితి లేక కాజ్‌వే పై పొర్లింది. దీంతో కాజ్‌వేపై ఏర్పాటు చేసిన వాల్స్ కొట్టుకుపోయాయి. మరో వైపు కాజ్‌వే లోతుగా కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం ప్రయాణించే భాంజీపేట, శ్రీమన్నారాయణపురం, కన్నాయపల్లి, గబ్బెట, కోడూర్, రామన్నగూడెంతో పాటు లింగాలఘణపురం మండలం కుందారం, కిష్టాజిగూడెం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధ్వంసమైన కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌ఎండీబీ అధికారులను వివరణ కోరగా స్పందించలేదు.

'జనగామ' గులాబీ మయం



వరంగల్-హైదరాబాద్ హైవేపై ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పోస్టర్లు, ఫ్లెక్సీలు



జాతీయ రహదారిపై ఎమ్మెల్యే భారీ హోర్డింగ్

- దారులన్నీ ఎల్కతుర్తి వైపే..

జనగామ: రజతోత్సవ సభ నేపథ్యంలో జనగామ గులాబీ మయమైంది. ఊరు వాడా నుంచి ఎల్కతుర్తికి కదిలేందుకు జనం సిద్ధమవుతున్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధి నుంచి 60వేల మందికి పైగా ప్రజలను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జనగామ నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నేడు(ఆదివారం) రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు, ప్రజలు తరలి వెళ్లనున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, కేడర్ సొంత కార్లలో భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించిన తర్వాత ఆయా మండలాలకు చెందిన వాహనాలు సభకు బయలు దేరుతారు. బీఆర్‌ఎస్ 25 ఏళ్ల వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంతో పాటు వరంగల్-హైదరాబాద్ ప్రధాన హైవే గులాబీ మయంగా మారిపోయింది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ కేడర్‌కు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు, కటౌట్లను ఏర్పాటు చేశారు.



ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, పాలకుర్తి మండలంలోని వావిలాలలో మహాత్మాహెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్, పాలకుర్తి సోమశేఖర్, సరాబు ఆంజనేయులు, మహాత్మాహెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు గంట రవీందర్, దోపతి రాంరెడ్డి, డొంగరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనంలో అదనపు కలెక్టర్ పరిశీలన

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవనం, ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను శనివారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ పరిశీలించారు. ఇటీవల గ్రీవెన్స్‌లో వీడీసీ ఆధ్వర్యంలో సమస్యలపై ఫిర్యాదు చేయగా స్వయంగా వచ్చి పరిశీలించి అసంపూర్తిగా ఉన్న భవన వివరాలను తెలుసుకున్నారు. త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో సంప్ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ డీఈ రవీందర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ సునీత, వీడీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసు, రాంచందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మల్లేశం, వీరయ్య, ఉపేందర్, వెంకటేశ్, సంజీవ, యాకయ్య, వసంత్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులను దశల వారీగా అందించడం జరుగుతుందని హౌసింగ్ డీఈ మాతృనాయక్ అన్నారు. శనివారం సాల్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాల్వాపూర్ పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. బేస్‌మెంట్ లెవల్ ఇళ్ల వివరాలను సేకరించి రూ. లక్ష మంజూరు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు.ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి మామిడాల మధు, పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 30వ తేదీ నుంచి స్థానిక ప్రెస్టన్ గ్రౌండ్‌లో ఎర్త్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. శనివారం మండలంలోని చౌడారంలో పోటీల వాల్‌పోస్టర్‌ను ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు ఆవిష్కరించి మాట్లాడారు. నో డ్రగ్స్..నో బెట్టింగ్ నినాదంతో పోటీలు నిర్వహిచనున్నామన్నారు. ఆసక్తిగల జట్లు ఎటువంటి ఎంట్రీఫీజు చెల్లించకుండా పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 98667 86897, 99489 01921 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకుడు యాసరపు కర్ణాకర్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాజు, ఎర్త్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి



యోగా చేస్తున్న విద్యార్థులు



సూచనలు ఇస్తున్న ఫౌండేషన్ నిపుణులు

జనగామ: విద్యార్థుల అకడమిక్ మేధస్సుతో పాటు సమగ్ర అభివృద్ధికి వేదికగా మారేలా క్రీస్తు జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని కళాశాల డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కళాశాలలోని బీటెక్ విద్యార్థులకు వెల్ బీయింగ్, మిరాకిల్ ఆఫ్ మైండ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక స్పష్టత, భావోద్వేగ సమతుల్యత, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇషా ఫౌండేషన్ నిపుణులు విద్యార్థులకు సులభమైన, శక్తివంతమైన యోగాసనాలు, శ్వాస నియంత్రణా సాంకేతికతలు, మైండ్‌ఫుల్ నెస్ కార్యక్రమాలు చేపట్టారు. ఈ అభ్యాసాలు ఒత్తిడిని తగ్గించడంలో, ఏకాగ్రతను పెంపొందించడంలో, సమగ్ర అభివృద్ధికి తోడ్పడేలా రూపొందించబడ్డాయి. ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యక్తిగత, అకడమిక్ విజయంలో అంతర్గత సంక్షేమం ప్రాముఖ్యతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

'ప్రజలను మభ్యపెట్టేందుకే రజతోత్సవ సభ'

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకే కోట్లాది రూపాయల ఖర్చు చేసి వరంగల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతల తీరుపై మండిపడ్డారు. ప్రధానంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఉద్దేశపూర్వకంగా మచ్చలేని నాయకుడైన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింత ఎల్లయ్య, ఎడ్ల వెంకటయ్య, సింగపురం వెంకటయ్య, మాజీ సర్పంచ్ నీరటి ప్రభాకర్, ప్రసాద్, గడ్డమీది సురేష్, జీడి రమేష్, అంబటి కిషన్‌రాజ్, చేపూరి ప్రభాకర్, జోసెఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.






మాతాశిశు సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల/సాక్షి నెట్‌వర్క్ : మాతాశిశు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగన్‌వాడీ సిబ్బంది సేవలందించాలని జనగామ జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో సీడీపీఓ సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన ప్రాజెక్ట్ స్థాయి పోషణ పక్షం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎస్‌ఆర్‌ఐ కుతూరు స్వర్ణ దామోదర్‌రెడ్డి దంపతులు చీరలు బహూకరించగా గర్భిణులకు అందజేసి సీమంతం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం చేపట్టారు. డాక్టర్ ప్రీతి, ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అలాగే పలు మండలాల్లోని అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆదర్శ రైతు దామోదర్‌రెడ్డి మృతి



దామోదర్‌రెడ్డి (ఫైల్)

దేవరుప్పుల: మూడు దశాబ్దాల కిందటనే వ్యవసాయ రంగంలో కొత్త రకం వంగడాలతో సాగుచేసే విధానాలకు దోహదపడిన ఆదర్శ రైతు ఈదునూరి దామోదర్‌రెడ్డి(87) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విద్యావంతులైన దామోదర్‌రెడ్డి మిత్రమండలి టోర్నమెంటులో క్రియాశీలకంగా పనిచేశారు. వ్యవసాయ రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం కోసం అప్పట్లోనే హర్యానాలోని డెయిరీఫామ్‌లో బ్రీడ్ తెచ్చి పాడిపరిశ్రమ అభివృద్ధికి బాసటగా నిలిచారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, దామోదర్‌రెడ్డి ఇద్దరు కుమారులు మృతి చెందడంతో కోడలు మంజులకీర్తిరెడ్డి ఆయనకు తలకొరివి పెట్టడం పలువురిని కలిచివేసింది. మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, జక్కుల గంగరాజు, తోటకూరి బాలరాజు, సోమల్లు, ఉమాప్రకాష్, సోమనర్సయ్య ఉన్నారు.

'భూభారతి'ని సద్వినియోగం చేసుకోండి

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే భూభారతి చట్టంపై తలపెట్టిన అవగాహన సదస్సును అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆడెపు ఆండాలు అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ భూహక్కుల పరిరక్షణ కోసం కొత్త చట్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఈనెల 28న(సోమవారం) కామారెడ్డిగూడెం-సీతారాంపురం మధ్య ఉన్న ఎంఎస్‌ఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే భూభారతి కొత్త చట్టం సదస్సుకు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు రానున్నందున సకాలంలో భూ సమస్యలు ఉన్న వారు హాజరు కావాలని సూచించారు.

ముత్యం చెరువు రీ సర్వేకు చర్యలు

అప్పిరెడ్డిపల్లె ముత్యం చెరువు దురాక్రమణకు గురౌతుందన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చెరువు హద్దుల వివాదానికి తెరపడేలా రీ సర్వే కోసం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆండాలు చెప్పారు. చిన్నమడూరు రెవెన్యూ పరిధి రికార్డుల్లో అప్పిరెడ్డిపల్లెలోని ముత్యం చెరువు 119 సర్వే నంబరులో 143.37 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువులోని చివరిలో లింగాలఘనపురం మండలం చీటూరు(కిష్టగూడెం)కు చెందిన 335 సర్వేనంబరులో నాలుగు ఎకరాల పట్టా ఉందని, కబ్జాచేసేందుకు యత్నిస్తున్న తీరుపై ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రాథమిక విచారణ మేరకు తదుపరి చర్యలు తీసుకునేందుకుగానూ జనగామ ఆర్డీఓ కె. గోపిరామ్‌కు నివేదిక పంపినట్టు ఆమె పేర్కొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

రఘునాథపల్లి: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నిడిగొండ మహాలక్ష్మి గోదాంలో మద్దూరి యాదగిరి అధ్యక్షతన జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా కార్మికులు పని ప్రదేశాల్లో, అడ్డాల్లో, గ్రామ పంచాయతీల వద్ద మేడే జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బైరగోని బాలరాజు, కడారి అంజనేయులు, కొంగరి నర్సయ్య, పెండ్యాల శ్రీను, దేవరపు హరిబాబు, సేవెళ్లి శ్రీశైలం, బుచ్చయ్య, రాజు, శ్రీను, నామాల యాదగిరి, ఎల్లేష్ పాల్గొన్నారు.



ట్రస్ట్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు

తరిగొప్పుల: ఆచరణ చారిటబుల్ ట్రస్ట్, సుభిక్ష అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్‌నాగారంలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో రెండు రోజుల పాటు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు ఉమేష్ తెలిపారు. శనివారం సమ్మర్ క్యాంపు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆర్ట్స్ క్రాఫ్ట్, ఆటలు, కెరీర్ గైడెన్స్‌తో పాటు వ్యక్తిగత వికాసం, పిల్లల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్లు, గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం వీరస్వామి,అర్జుల సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయుడు తాటికొండ పెద్దన్నతోపాటు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిక

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోనె యాదవరెడ్డి వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్య నివాసంలో వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి సాదరణంగా ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని రాజయ్య చెప్పినట్లుగా పెండ్లి మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలివెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో రగోని శ్రీనివాస్, గోనె మల్లారెడ్డి, పెద్దగోని రాజు తదితరులు ఉన్నారు.

బంజారా భవనం మంజూరు చేయండి

తరిగొప్పుల: మండలకేంద్రంలో బంజారా భవనం, జూనియర్ కళాశాల మంజూరు చేయాలని మండలంలోని పలు తండావాసులు కోరారు. గిరిజరెలు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో జాలుబాయితండా, వాచ్యాతండా, మాన్‌సింగ్‌తండా, బొత్తలపర్రె గ్రామాలకు చెందిన సుమారు 20 మంది కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు.

సంక్షిప్త సమాచారం

శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించండి

చిల్పూరు: వర్షాకాలం రాకముందే గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను యజమానులు స్వచ్ఛందంగా తొలిగించాలని ఎంపీఓ మదుసూధన్ సూచించారు. శనివారం శ్రీపతిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ల యజమానులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వాటిని పరిశీలించడం జరిగిందన్నారు. యజమానులు స్వచ్ఛందంగా ఇళ్లను తొలగించాలని, లేని పక్షంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వివరాలు అందించాలి

నర్మెట: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు తమ వివరాలను అందించాలని పీఆర్‌ఏఈ, క్లస్టర్ ఇన్‌చార్జ్ గురిజాల ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన ఆయన వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పత్రాలను పరిశీలించారు.

అధికారులకు సహకరించాలి

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు పరిశీలన వచ్చే అధికారులకు సహకరించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రంజిత్‌తో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

జఫర్‌గఢ్: మత్స్యకారుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి పిలుపునిచ్చారు. తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి ప్రాంగణంలో సొసైటీ సభ్యులతో మండల సమావేశాన్ని నాయిని రామస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భిక్షపతి హాజరై మాట్లాడారు. మత్స్యకారులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సోమనర్సయ్య, పాక నర్సయ్య, చిక్కుడు రామచంద్రు, సింగారపు వెంకటయ్య, మట్టిపల్లి బుచ్చయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా వారధిగా పని చేయాలి

పాలకుర్తి టౌన్: ప్రభుత్వానికి ప్రజల మధ్య కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారధిగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గూడ రవీందర్, అన్ని గ్రామాల సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



